# వానకాలం ప్రణాళిక ఖరారు

## నిర్మల్ జిల్లాలో 4.30 లక్షల ఎకరాల్లో సాగు

- అందుబాటులో వరి, పత్తి, సోయా విత్తనాలు
- 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- ప్రస్తుతం అందుబాటులో 13,796 ఎంటీఎస్‌లు మాత్రమే



నిర్మల్, మే 26(నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా 4.30 లక్షల ఎకరాల్లో పత్తి, వరి, మక్క, సోయా, పప్పు దినుసులు పండించేందుకు అవసరమైన కార్యాచరణను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. అవసరమైన విత్తనాలు, ఎరువులను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో వానకాలం సీజన్‌లో 4.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయాని అంచనా వేశారు. ఇందులో పత్తి 1.50 లక్షల ఎకరాలు, వరి 1.20 లక్షలు, సోయా ఒక లక్ష, కందులు 10 వేలు, మక్క 30 వేలు, పసుపు 15 వేలు, మినుములు, పెసర్లు, ఇతర పంటలు 5 వేల ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ఈసారి వరిని తగ్గించి, పత్తి పంటతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతును ప్రోత్సహించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీర్ఘకాలం పాటు అధిక లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేలా గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు.

### 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసే ఏర్పాట్లలో ఉన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఏ పంటలకు ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయో అంతే స్థాయిలో డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఎరువుల కొరత రాకుండా అవకాశం ఉన్న చోట బఫర్ స్టాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈసారి 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా.. ప్రస్తుతం 13,796 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా, ప్రస్తుతం 8,879 మెట్రిక్ టన్నులు.. 12 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరముండగా, 3,609 మెట్రిక్ టన్నులు.. ఆరు వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరముండగా, 1,308 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే డీలర్ల వద్ద 475 గ్రాములు గల పత్తి విత్తనాల ప్యాకెట్లు 3.50 లక్షలు అందుబాటులో ఉన్నాయి. అలాగే వరి విత్తనాలు 20 వేల క్వింటాళ్లు, సోయా 25 వేలు, కంది 400 క్వింటాళ్లు, మక్క 1,200 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### నకిలీ విత్తనాలపై నిఘా

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈసారి మే నెలలోనే వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు తొందరగా రావడంతో రైతులు తమ చేలలో దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు పటిష్ట నిఘా పెట్టారు. ఇందుకోసం ఇప్పటికే విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మండలానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయగా, ఈ బృందంలో ఆ మండల పరిధిలోని ఎస్సై, వ్యవసాయ అధికారి ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో పోలీసు శాఖ నుంచి సీఐ, వ్యవసాయాధికారి, విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్‌లతో కూడిన బృందం ఈ తనిఖీలను పర్యవేక్షిస్తారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో ప్రభుత్వ అనుమతితో విత్తనాలను విక్రయించేందుకు 450 విత్తన దుకాణాలు ఉన్నాయి. మరోవైపు రైతులకు నాణ్యమైన విత్తనాల కొరత లేకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

### మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు చేయాలి..

*రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేసి లాభాలు పొందాలి. సాగులో మెలకువలు పాటించాలి. మార్కెట్‌లో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆన్‌లైన్ విధానంతోపాటు, క్యూఆర్ కోడ్ అమల్లోకి తీసుకొచ్చాం. ఇప్పటికే విత్తనాలు సరఫరా చేసే దుకాణాల్లో నిరంతరంగా తనిఖీలు చేపడుతున్నాం. నకిలీ విత్తనాల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోకుండా రైతులు అధికారులను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందాలి. ముఖ్యంగా రైతులు లైసెన్సు కలిగి ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి వచ్చి తక్కువ ధరకు ఇచ్చే విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు. అలాగే రైతులు ఏటా పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు.*

**- అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నిర్మల్**



### నింపిన బ్యాగులను ఖాళీ చేయ మంటున్నరు

*నాకున్న ఏడెకరాల్లో వరి వేశా. 11 ట్రాక్టర్ల ధాన్యం వచ్చింది. ఐదు ట్రాక్టర్ల ధాన్యానికి 200 సంచులను వారం రోజుల కింద ఇచ్చారు. మిగతా వడ్లకు సంచులు ఇవ్వడం లేదు. వారం రోజుల కింద 200 సంచులు నింపాం. కానీ.. ప్రభుత్వం తీసుకపోలేదు. అంతలో వర్షాలు వచ్చాయి. తడిచి పోవడంతో మొలకలు వచ్చాయి. బూజు పడుతున్నాయి. నింపిన బ్యాగులు ఖాళీ చేయమంటున్నరు. నాకు బోధకాలు ఉంది. మరో 250 బస్తాల ధాన్యం తడిచింది. ధాన్యం మొత్తం తడిచి మొలకలు వస్తున్నాయి. ఎవరు పట్టించుకోవడం లేదు.*

**- దావ ఎర్రన్న, పార్‌పెల్లి, లక్ష్మణచాంద మండలం**

బూజు పట్టిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు దావ ఎర్రన్న

**కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తిన వడ్లు**

# ధాన్యానికి బూజు

**చిత్తడి చిత్తడిగా కేంద్రాలు.. ఆరబెట్టడానికి స్థలం కరువు..**

**పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళనలో రైతులు..**

లక్ష్మణచాంద, మే 26 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. వడ్లు మొలకెత్తగా.. కేంద్రాలు చిత్తడి చిత్తడిగా మారాయి. ఆరబెట్టుకోవడానికి కూడా స్థలం లేదు. పార్ పెల్లిలో ఇప్పటికీ కనీసం 50 శాతం ధాన్యం కూడా ప్రభుత్వం సేకరించలేదు. 20 రోజుల క్రితం రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. కానీ.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం తో మొలకెత్తింది. బూజు కూడా వచ్చిందని రైతులు వాపోతున్నారు. మండలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఒక సన్నరకం, 11 దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటివరకు 90 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా బాబాపూర్ కొనుగోలు కేంద్రం నుంచి ఇటీవల తరలించిన ధాన్యంలో 64 బస్తాలు తడిశాయని సోమవారం రైస్‌మిల్లర్లు తిప్పి పంపినట్లు రైతులు పేర్కొంటున్నారు.



పార్‌పెల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యానికి పట్టిన బూజు



### బిచ్చగాళ్లలా చూస్తున్నరు..

*ఆరుగాలం కష్టపడి పంటను కేంద్రాలకు తీసుకొస్తే బిచ్చగాళ్లలా చూస్తున్నారు. నేను 18 రోజుల క్రింద వడ్లు తీసుకొచ్చా. అప్పటి నుంచి సంచులు ఇవ్వాలని బతిమిలాడిన ఇవ్వలేదు. చివరికి వర్షాలు కురియడంతో ఎండిన ధాన్యం కూడా మొలకలు వచ్చింది. ఎందుకు సంచులు ఇస్తలేరు అంటే బెదిరిస్తున్నరు. ప్రైవేటులో అమ్ముకుంటే ఇప్పటికీ పైసలు కూడా వచ్చేవి. ప్రభుత్వాన్ని నమ్ముకుంటే ఉన్న వడ్లకు బూజు కూడా వచ్చింది.*

**- మెరుగు ఎర్రన్న, పార్‌పెల్లి, లక్ష్మణచాంద మండలం**



పార్‌పెల్లి కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబెట్టిన ధాన్యానికి మొలకలు

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

*ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. పలు ప్రాంతాల నుంచి టెలీఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను కూడా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి , తదితరులు పాల్గొన్నారు.*

*- నిర్మల్ చైన్‌గేట్, మే 26*



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

### ధాన్యాన్ని కొనుగోలు చేయాలి..



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రైతులు

*నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో త్వరితగతిన కొనుగోళ్లు చేయడం లేదని రైతులు సోమవారం పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయంకు వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో 30 రోజులవుతున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి ధాన్యం త్వరితగతిన కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.*

### వ్యవసాయ పనులను అధికారులు అడ్డుకుంటున్నరు

*నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండలంలో గల పాత తర్లపాడ్ గ్రామంలో 113 సర్వే నంబర్‌లో 19 మంది రైతు కుటుంబాలకు వ్యవసాయ పట్టా భూములున్నాయి. ఈ భూమిలో వ్యవసాయ పనులు చేపడుతుంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని సోమవారం రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 34 ఏళ్లుగా పట్టాలు ఉండి సాగు చేసుకుంటున్న భూముల్లో వ్యవసాయ పనులు చేసుకుంటుంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు.*





### కూరగాయల మార్కెట్‌ను వేరే చోటుకు తరలించాలి

*నిర్మల్ పట్టణంలోని ఇందిరానగర్‌లో గల గాంధీపార్కులో నిర్వహించే కూరగాయల మార్కెట్‌ను వేరేచోటుకు తరలించాలని సోమవారం కాలనీవాసులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన రోడ్డుకు వెళ్లే మార్గంలో కూరగాయల మార్కెట్ నిర్వహించడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా చనిపోయినపుడు ఈ దారిగుండా శవయాత్ర తీసుకువెళ్తుంటారని అప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.*

# సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ, మే 26 : సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీటిని తక్షణమే తొలగించి, తాత్కాలిక మొరం రోడ్డును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముండే పాండురంగ్, మాజీ ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సాబీర్, రమేశ్, మహేందర్‌రెడ్డి, గణేశ్ ఉన్నారు.



మండల కేంద్రంలో రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### టీజేఎఫ్ పోస్టర్ల ఆవిష్కరణ

నేరడిగొండ, మే 26 : తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25 వసంతాల రజతోత్సవ సంబురాల పోస్టర్లను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు పిడికిలి బిగించి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు జలవిహార్ ఆడిటోరియం నెక్లెస్‌రోడ్డు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ తెలిపారు.

### అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించిన వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, మే 26 : అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. కేసు వివరాలను వెల్లడించారు. గతంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో కొండూరి గంగాధర్ ఫేక్ అటెండర్ సుమిత్రాబాయి పేరిట నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆశమ్మ భూమిని కబ్జా చేశాడు. అనంతరం ఈ భూమిని విద్యానగర్‌కు చెందిన సయ్యద్ రజాక్‌కు అమ్మాడు. ఈయన బ్రహ్మకంటి సత్యనారాయణకు, ఈయన నళినికి విక్రయించాడు. ప్రస్తుతం నళిని బ్యాంకు రుణం తీసుకుని ఇల్లు నిర్మాణం చేపడుతున్నది. ఈ క్రమంలో విషయం తెలిసి ప్రభుత్వం ద్వారా కేటాయించిన స్థల యజమాని తోట ఆశమ్మ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం జడ్పీ కార్యాలయంలో అటెండర్‌గా విధుల నిర్వర్తిస్తున్న(కొండూరి గంగాధర్) సోమవారం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు.

### అమ్మవారి దర్శనానికొచ్చి ఇద్దరు మృతి

బాసర, మే 26 : బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ప్రమాదశాత్తు గోదావరి పడి మృతి చెందిన ఘటన పలువురిని కలిచి వేసింది. మహారాష్ట్రలోని పర్భాని జిల్లా టాక్లీ గ్రామానికి చెందిన ఐదుగురు సోమవారం సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొదటి ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కుల్దీప్ బాబా సాహెబ్ దేశ్మాక్(11) నీటిలో పడి మృతి చెందాడు. మరో ఘటనలో నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బొల్ల మల్లరాజు(40) గోదావరిలో స్నానం ఆచరిస్తుండగా గల్లంతయ్యాడు. ఇతడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

### సన్నాలు కొనండి సారూ..

**మార్కెట్ యార్డులో 20 రోజులుగా పడిగాపులు**

ఖానాపూర్, మే 26 : ఖానాపూర్ మార్కెట్ యార్డులో సన్న రకం ధాన్యం కొనుగోలు చేసే వారు కరువయ్యారు. మండల వ్యాప్తంగా 11 వేలకు పైగా ఎకరాల్లో సన్నాలు సాగయ్యాయి. పీఏసీఎస్ కేంద్రానికి తీసుకొచ్చి 20 రోజులు గడిచినా కొనుగోలు చేయడం లేదు. వర్షం ఎప్పుడు పడుతుందో అని దిగులుతో కేంద్రాల వద్దే రైతులు నిరీక్షిస్తున్నారు. తేమ శాతం వచ్చినప్పటికీ వర్షానికి తడవడంతో ధాన్యాన్ని ఆరబెడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్వాహకులు, అధికారుల సమన్వయ లోపం, సన్న వడ్లు కొంటే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందనో అని కొనుగోళ్లతో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సన్న వడ్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్ యార్డులో కుప్పలుగా పోసివున్న సన్నరకం వడ్లు